
క్లుప్తంగా

యథేచ్ఛగా ఆక్రమణలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ బుడమేరు మధ్య కట్ట ఏలూరు కాలువ పక్కన యథేచ్ఛగా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ఏలూరు కాలువలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ఎవరికీ వారు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం అనుమానాలకు తావిస్తోంది. అన్ని ప్లాన్‌లు తీసుకుని ఇళ్ల నిర్మాణాలను చేపట్టే ఇళ్లను తనిఖీ చేసే టౌన్ ప్లానింగ్ అధికారులు ఇక్కడ ఆక్రమణలను పట్టించుకోక పోవటం విశేషం. ఇక్కడ ఏలూరు కాలువలోకి నిర్మాణాలు చేయటంతో పాటు సెప్టిక్ పైపులను సైతం ఏలూరు కాలువలోకి వదలివేస్తున్నారు. దీనివల్ల ఏలూరు కాలువ కలుషితం అవుతుంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అలంకార్ సబ్ స్టేషన్‌లో 11 కేవీ సత్యనారాయణ స్వామి టెంపుల్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, సీతన్నపేట, స్వామి స్ట్రీట్, ముదునూరు వారి వీధి, సుందరమ్మ వీధి, దుర్గి వారి వీధి, ఆంధ్ర రత్న రోడ్డు, నాగేశ్వరరావు పంతులు రోడ్డు, జ్ఞానోలివ్ స్ట్రీట్, ఉయ్యూరు జమిందార్ స్ట్రీట్, స్విమ్మింగ్ పూల్ రోడ్డు, ఉడత వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సోమవతి అమావాస్యను పురస్కరించుకొని లెనిన్‌సెంటర్‌లోని ఓం షిర్డీ సాయిబాబా నాగమానసాదేవి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీదేవికి అంకితం చేయబడిన మార్గశిర మాసంలో అమావాస్య సోమవారం రోజు(సోమవతి అమావాస్య) లక్ష్మీ కటాక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం. పలు రకాల పూలతో అమ్మవారికి అభిషేకాలు చేశారు. ఆయురారోగ్యాల కోసం, స్త్రీ సౌభాగ్యం కోసం మహిళలు అమావాస్య సంధ్యా వేళలో మందిరం ఈశాన్య దిక్కులో గోవు నెయ్యితో ఐశ్వర్య దీపం వెలిగించి అమ్మవారిని కొలిచారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

బహుముఖ ప్రతిభాశాలి వరప్రసాదరావు



విజయవాడకల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి జీవీఎస్ వరప్రసాదరావు అని సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. విజయవాడ సాంస్కృతిక కళా సంస్థల వేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదికపై సుప్రీంకోర్ట్, న్యాయవాది, కళాపోషకులు సాంస్కృతిక సంస్థల ప్రతినిధి వరప్రసాదరావు ఆకస్మిక మృతికి సంతాప సభను సోమవారం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ.. న్యాయవాదిగా ఆయన పేదలకు సేవలను అందించారన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు మాట్లాడుతూ ఆయన అనేక సాంస్కృతిక సంస్థలకు సహాయ సహకారాలను అందజేశారని తెలిపారు. సంస్మరణ సభలో దారా కరుణశ్రీ, చింతకాయల చిట్టిబాబు, మారేపల్లి జోషి, జయంతి చక్రవర్తి, ప్రభల శ్రీనివాస్, ఎంఎస్ నారాయణ, దామోదర గణపతిరావు పాల్గొన్నారు.

3 నుంచి తిరువూరులో సీపీఎం జిల్లా మహాసభలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జనవరి 3, 4, 5 తేదీల్లో సీపీఎం ఎన్టీఆర్ జిల్లా 25వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ తెలిపారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దోనేపూడి కాశీనాథ్, కె శ్రీదేవి, కార్పొరేటర్ బోయి సత్యబాబులతో కలిసి మహాసభల వాల్ పోస్టర్‌ను సోమవారం కృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలో తొలి రోజు జనవరి 3న జరిగే ప్రజా ప్రదర్శన, బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన పోరాటాలు, కార్యక్రమాలను వివరించారు. మహాసభల్లో పార్టీ భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తామని చెప్పారు.

బాబోయ్.. రామానగర్ కాలనీ

- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం
- చెలరేగిపోతున్న గంజాయి బ్యాచ్
- నడి రోడ్లపైనే గంజాయి, మద్యం సేవనం
- పట్టించుకోని పోలీసులు



రామానగర్ కాలనీ అపార్టుమెంట్లు



మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్‌లతో నిండిన అపార్టుమెంట్ ప్రాంగణం

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): అజిత్ సింగ్‌నగర్‌లోని రామానగర్ కాలనీ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ఇక్కడ ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ఇందుకు నిలయమైంది. నిత్యం పదుల సంఖ్యలో ఇక్కడ చేరే యువకులు గంజాయి, మద్యం సేవించటం గొడవలకు దిగటం పరిపాటిగా మారింది. తెల్లవారు జాము నుంచే ఇక్కడ ఖాళీగా ఉన్న అపార్టుమెంట్‌లలో గంజాయి బ్యాచ్ సభ్యులు గుంపులుగా చేరి గంజాయి, మద్యం సేవించటం ఆ మత్తులో తమలో తాము గొడవలు పడటమే కాకుండా అటుగా వెళ్లే వారిపై దాడులకు దిగుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

వ్యభిచార కేంద్రాలుగా ఖాళీ ప్లాట్‌లు..

గంజాయి బ్యాచ్ చేసే ఆగడాలకు రాత్రి, పగలు తేడా లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. నడి రోడ్లపైనే కూర్చొని గంజాయి, మద్యం సేవిస్తూ ప్రశ్నించిన వారిపై తమ జులుంను ప్రదర్శిస్తున్నారు. రామానగర్ కాలనీలో అధిక శాతం ఖాళీ ప్లాట్‌లు ఉండటంతో అసాంఘిక శక్తులు వాటిని వ్యభిచార కేంద్రాలుగా మార్చుకుంటున్నాయి. చీకటి పడితే చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకువచ్చి వ్యభిచార కార్యక్రమాలకు పాల్పడుతున్నారని. దీంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం అల్లర్లు, గొడవలు..

రామానగర్ కాలనీ నిత్యం అల్లర్లు, గొడవలతోనే ఉంటుందని స్థానికులు చెబున్నారు. రాత్రయితే నిద్ర పట్టని పరిస్థితి ఇక్కడ ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే యువకులు ఆటోలు, బైకులపై ఇక్కడికి చేరుకుంటారు. ఇక్కడకు వచ్చిన యువకులు గంజాయి, మద్యం సేవించి రాత్రంతా గొడవలు పడటం పరిపాటిగా మారిందని దీంతో ఇళ్లల్లోనుంచి బయటకు రాలేక పోతున్నామని మహిళలు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో పోలీసులు నిఘా లేకపోవటం, సరైన చర్యలు తీసుకోక పావటంతో గంజాయి బ్యాచ్ సభ్యులు తమ ఆగడాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ జరిగే అసాంఘిక కార్యక్రమాలపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బయటకు రాలేక పోతున్నాం..

గంజాయి, మద్యం సేవించి యువకులు చేసే గొడవలతో ఇంట్లో నుంచి బయటకు రాలేక పోతున్నాం. వారిని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేకపోవటంతో వారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పాయింది.

– జయమ్మ, స్థానికురాలు

మద్యం సీసాలు, రాళ్లతో దాడులు..

గుంపులు గుంపులుగా చేరే యువకులను మందలిస్తే ఖాళీ మద్యం సీసాలు, రాళ్లతో దాడులకు దిగుతున్నారు. మద్యం మత్తులో ఉన్న వారిని అడ్డుకోవటం మావల్ల కావటం లేదు. పోలీసులే తగిన చర్యలు తీసుకొవాలి.

– వెంకట్‌రెడ్డి, స్థానికుడు

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న వీఎంసీ ఏసీ చంద్రశేఖర్, ఇన్‌చార్జి సీఎంఓహెచ్ సురేష్ బాబు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు – పరిష్కార కార్యక్రమంలో ఆయన నగర వాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విజయవాడ నగరపాలక సంస్థ 64 డివిజన్లలో నగర వాసులకు కల్పించే మౌలిక వసతుల్లో సమస్యలు ఉత్పన్నమైతే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. యుద్ధ ప్రాతిపదికన వాటిని పరిష్కరించి అర్జీదారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో 10 ఫిర్యాదులు అందాయన్నారు. అందులో ఇంజినీరింగ్ విభాగంపై–4, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగాలపై రెండు చొప్పున, ప్రజారోగ్యం, ఎస్టేట్ విభాగంపై ఒక్క ఫిర్యాదు వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఇన్‌చార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్య కుమారి, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ వెంకటేశ్వరరావు, ఎస్టేట్స్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీఎస్ఎస్ సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అమృత సేవలు అభినందనీయం



డాక్టర్ అమృతను సత్కరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉమ్మడి కృష్ణాతో పాటు, ఎన్టీఆర్ జిల్లాలో ఇమ్యునైజేషన్ అధికారిగా డాక్టర్ అమృత సమర్థవంతంగా విధులు నిర్వహించారని డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా డీఐఓగా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై గుంటూరు నగరపాలకసంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. డాక్టర్ అమృతను డీఎంహెచ్ఓతో పాటు పలువురు వైద్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారన్నారు. నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌టీఓ డాక్టర్ జె.ఉషారాణి, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవీ నాయుడు, డీఎంఓ మోతీబాబు, వైద్యులు నవీన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడకు సజ్జనరావు వన్నె తెచ్చారు



సజ్జనరావు దంపతులను సన్మానిస్తున్న శ్రీకాంత్ తదితరులు

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలో కబడ్డీ క్రీడకు యండ్రపాటి సజ్జనరావు వన్నె తెచ్చారని పలువురు సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పేర్కొన్నారు. విజయవాడకు చెందిన సజ్జనరావు జాతీయ, అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో రాణించి తద్వారా రైల్వే శాఖలో ఉద్యోగం పొంది, 34 ఏళ్ల రైల్వే శాఖ ద్వారా ప్రజలకు సేవలందించారని కొనియాడారు. నేడు ఉద్యోగ విరమణ చేయనున్న సజ్జనరావును విజయవాడకు చెందిన సీనియర్ కబడ్డీ క్రీడాకారులు రైల్వే స్టేడియంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఎన్నో జాతీయ పతకాలను సాధించారని గుర్తు చేశారు. రైల్వే శాఖలో చేరిన తరువాత దక్షిణ భారత రైల్వే శాఖ కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహించారని, ఆయన ఆధ్వర్యంలోని జట్టు ఎన్నో పతకాలను దక్షిణ భారత రైల్వే శాఖకు అందించిందన్నారు. పంచాయతీ రాజ్ రిటైర్డ్ ఎస్ఈ ఎన్.వి.రమణ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.పి.రావు, ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ పాల్గొని సజ్జనరావు దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

సంగీత విదుషీమణి పద్మావతికి సత్కారం



పద్మావతిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: గాత్ర సంగీత విద్వాంసురాలు చింతామణి సంగీత విద్యాలయం వ్యవస్థాపకురాలు సీఎస్ పద్మావతికి ఆత్మీయ సత్కార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తెలుగు కళావాహిని, ఎంఎస్ బాలసుబ్రహ్మణ్యం స్మారక సమితి, కేవీ బ్రహ్మానందం కళా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కౌతా పూర్ణానందం కళా వేదికపై జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీతం నిరంతరం ప్రవహించే గంగా ప్రవాహమన్నారు. దాన్ని దైవ సేవగా భావించాలని సూచించారు. సంగీత కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కేఎస్ గోవిందరాజన్ పద్మావతి సంగీత సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా సంగీత విద్వాంసురాలు పద్మావతి నిర్వహించిన గాత్ర సంగీత కచేరీ మధురంగా సాగింది. శ్యామసుందర్, కె.రాంకుమార్ వాద్యసహకారం అందించారు. కార్యక్రమంలో భాగంగా చింతామణి సంగీత విద్యాలయానికి చెందిన బృంద సభ్యులు గీతాంజలి, లక్ష్మీదేవి, అశ్వద్ధమ్మ, జయమ్మ, కావ్య, మీనాక్షి తదితరులు పలు సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, గోళ్ల నారాయణరావు, చీదెళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవాలి



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ మజ్జి సూరిబాబు అన్నారు. అభయ హ్యూమన్ సర్వీస్ సొసైటీ కార్యాలయంలో నిరుపేద, మెరిట్ విద్యార్థులకు సొసైటీ ఆధ్వర్యాన ఆదివారం రాత్రి స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. ప్రతీ ఏటా స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న అభయ హ్యూమన్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బడేటి ధర్మారావును ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సేవాకార్యక్రమాలు చేయాలని సూచించారు. విశిష్ట అతిథి కాపుతెలగ బలిజ జేఏసీ కన్వీనర్ దాసరి రాము, ఆంధ్రా హాస్పిటల్ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎన్‌వీ హరికుమార్, ఏపీసీపీడీసీఎల్ డీఈ కేవై కొండలరావు మాట్లాడుతూ.. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు బడేటి ధర్మారావు మాట్లాడుతూ.. తన వంతు బాధ్యతగా ప్రతీ ఏటా స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నానని తెలిపారు. ఒక విద్యార్థి జీవితంలో ఉన్నతంగా స్థిరపడితే ఆ కుటుంబం మొత్తం బాగుపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ ఉప్పు రంగప్రసాద్, ఎల్.జగన్‌మోహన్‌రావు, బి.రమేష్ బాబు తదితరులు పాల్గొని మాట్లాడారు.

నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలి



సీఐ లక్ష్మీనారాయణకు చెక్కును అందజేస్తున్న శ్రీనగర్ కాలనీ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రజల భాగస్వామ్యంతోనే నేరాలను సులభంగా నియంత్రించగలమని ఎస్ఎన్‌పురం సీఐ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఇటీవల శ్రీనగర్‌కాలనీలో పర్యటించిన సందర్భంగా ఆయన అక్కడ సమస్యలపై స్థానికులతో మాట్లాడారు. తమ చుట్టు పక్కల అనుమానిత వ్యక్తులు, సంఘ విద్రోహులు, అసాంఘిక శక్తుల సంచారంపై పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా సూచించారు. ముఖ్యంగా తమ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను నియంత్రించగలమని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనగర్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలతో మాట్లాడిన ఆయన కాలనీలో రూ.2.50 లక్షలతో 40 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అందుకు 50 శాతం కాలనీవాసులు భరిస్తే మిగిలిన సగం పోలీసు శాఖ భరించి కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. దీనికి స్పందించిన అసోసియేషన్ అధ్యక్షుడు టి.కేశవరావు, కార్యదర్శి కె.జి రామారావు, సభ్యులు భీమవరపు మాల్యాద్రి, ద్వారకానాథ్, రామకృష్ణ తదదితరులు సోమవారం ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో సీఐ లక్ష్మీనారాయణను కలసి అసోసియేషన్ తరుపున రూ.1.25 లక్షల చెక్కును అందజేశారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా ఉపాధ్యక్షుడిగా కొల్లూరి ఎన్నిక



మధురానగర్(విజయవాడ సెంట్రల్): నగరానికి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు, ఎక్స్‌రే సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కొల్లూరి వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా వైస్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరులో జరిగిన అంతర్జాతీయ వాకర్స్ సమావేశంలో కొల్లూరిని ఏరియా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పుష్కర కాలంగా నడక ఉద్యమానికి సేవలు అందించిన కొల్లూరి ఉత్తమ వాకర్స్ అధ్యక్షుడు, రీజినల్ కౌన్సిలర్, జిల్లా గవర్నర్‌గా ప్రశంసలు అందుకున్నారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆదుకునేందుకు మహాత్మాగాంధీ ఫెలోషిప్ ద్వారా రూ.20 లక్షల నిధిని సమకూర్చారు. సాహితీవేత్తగా, లయన్స్ క్లబ్‌లో వివిధ హోదాలలో పలు సేవలు అందించారు. వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఆయనను ఎక్స్ రే, లయన్స్ క్లబ్, డాక్టర్ బ్రహ్మదేశం సొసైటీ సభ్యులు సోమవారం అభినందించారు.

హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహదారులు రోడ్లపైకి వస్తే చర్యలు తప్పవని త్రీ ట్రాఫిక్ సీఐ కిషోర్ బాబు హెచ్చరించారు. బీఆర్టీఎస్ రోడ్డు, ఫుడ్ జంక్షన్‌లో హెల్మెట్ లేని వాహనదారులకు త్రీ ట్రాఫిక్ పోలీసులు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రమాద సమయంలో హెల్మెట్ ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తోందని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో హెల్మెట్ లేకుండా ప్రయాణించే వాహనదారులను గుర్తించి వారికి హెల్మెట్ వలన కలిగే ప్రయోజనంపై అవగాహన కల్పించారు. వాహనాల పెండింగ్ చలనాలు వసూలు చేసి, హెల్మెట్ తెచ్చుకున్న తరువాతనే వారి వాహనాలను అందజేశారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత మార్గదర్శకాలు, ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని లేని పక్షంలో జరిమానాతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని సీఐ కిషోర్‌బాబు స్పష్టం చేశారు.

క్రీడాకారుడు హుస్సేన్‌కు ఆర్థిక సహాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రన్నింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన నగరానికి చెందిన క్రీడాకారుడు షేక్ మక్బుల్ హుస్సేన్‌ను వీఎంసీ ఫ్లోర్ లీడర్ ఎస్.బాలస్వామి ఆయన కార్యాలయంలో శాలువాతో సత్కరించి అభినందించారు. జనవరిలో జార్ఖండ్‌లో జరిగే పోటీలలో పాల్గొంటున్న హుస్సేన్‌కు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని బాలస్వామి ఆకాంక్షించారు.

కళాకారుల ప్రతిభను ప్రోత్సహించాలి



శ్రీనివాసరావుకు పురస్కారం అందజేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, నిర్వాహకులు

విజయవాడకల్చరల్: కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. సుఖమంచి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో సోమవారం సుఖమంచి పబ్లికేషన్స్ ప్రతిభా పురస్కారాల సభ, నాట్యప్రదర్శనలు, సుఖమంచి హాస్యపుజల్లులు 1 గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. కళాకారులు సాంస్కృతిక వారధులన్నారు. రంగస్థలానికే అంకితమైన సుఖమంచి అనేక మంది నటులను పరిచయం చేశారని తెలిపారు. నిర్వాహకుడు సుఖమంచి సంస్థ లక్ష్యాలను వివరించారు. వివిధ రంగాలకు చెందిన ఎన్ఎస్ మూర్తిరాజుకు దాసరి నారాయణరావు, బీసీ పద్మదాసుకు బాపు, యనాపు ఉమామహేశ్వరరావుకు బళ్లారి రాఘవ, కొప్పుల ఆనంద్‌కు కొంగర జగ్గయ్య, కొల్లి నాగేశ్వరరావు, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కేవీఎల్ఎస్ శర్మకు వీరేశలింగం, మురుపిళ్ళ హనుమంతరావుకు ధన్వంతరి, రాయన శ్రీనివాసరావుకు నటరాజ రామకృష్ణ, డోకిపర్తి వరప్రసాద్‌కు గురజాడ పురస్కారాలను అందజేశారు. నటరాజ నృత్యాలయం చిన్నారులు ఆంధ్రనాట్యం అంశంగా నృత్యాలను ప్రదర్శించారు.

రహదారికి మరమ్మతులు చేయాలని వినతి



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో వాటర్‌పైపులైన్ పనుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. మధురానగర్ పప్పుసుతోట తదితర ప్రాంతాలలో అమృత్ పథకంలో భాగంగా ఇంటింటికీ వాటర్ పైపులైన్ వేస్తున్నారు. ఇందుకుగానూ రోడ్డును తవ్వి ఇంటింటికీ కనెక్షన్ ఇస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ తవ్విన రోడ్డును మాత్రం సరిచేయటం లేదు. దీంతో రోడ్డు గుంతలుగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. పండుగ రోజులలో ఇంటి ముందు ముగ్గులు కూడా వేసుకునే వీలులేకుండా చేశారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చురుగ్గా ప్యాచ్‌వర్కులు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



ఎస్ఎన్‌పురంలో పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శర్వాణిమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని పలు వీధుల్లో గతంలో తవ్వి వదిలేసిన గోతులు, నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్న వీధుల్లో ప్యాచ్ వర్కులు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు పనులు చేపట్టినట్లు స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి పేర్కొన్నారు. డివిజన్‌లో జరుగుతున్న పనులను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పర్యటలో భాగంగా స్థానికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ముఖ్యంగా గతంలో కేబుల్స్, వాటర్ పైప్ నిర్మాణం కోసం అనేక వీధుల్లో గోతులు తవ్వి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అదే విధంగా పలు వీధుల్లో వాహనాలు స్పీడుగా నడుపుతుండటంతో తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు స్థానికులు తెలిపారన్నారు. దీనిపై నగరపాలకసంస్థ జోనల్ కమిషన్, ఇతర అధికారులతో కలసి డివిజన్ పర్యటలో సమస్యలను నేరుగా వారి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మరమ్మతు పనుల కోసం కౌన్సిల్‌లో ప్రతిపాదించడంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించి సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌లకు సూచించారు.

నూతన సంవత్సర వేడుకలకు అనుమతుల్లేవు



సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): నూతన సంవత్సర వేడుకలకు నగరంలో ఎటువంటి అనుమతులు లేవని నార్త్ డివిజన్ ఏసీపీ డాక్టర్ స్రవంతిరాయ్ స్పష్టం చేశారు. ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆమె తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని, హిస్టరీ షీటర్స్‌పై నిరంతరం నిఘా ఉంచాలని, కేసులను త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అప్రమత్తంగా ఉండాలని సీఐ లక్ష్మీనారాయణకు సూచించారు. ఎర్రకట్ట, ప్రభాస్ కాలేజీ, సీతన్నపేట గేటు, శారద కాలేజీ జంక్షన్, భాను నగర్ జంక్షన్, గవర్నమెంట్ ప్రెస్, ఏలూరు లాకులు, అలంకార్ సెంటర్‌ల వద్ద ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ డ్రైవింగ్, రాత్రి 11 గంటల తరువాత వాహనాలు నడపడం, గుంపులుగా చేరి రోడ్లపై అల్లర్లు చేయడం నిషేధమని, హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన సంవత్సరాన్ని తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరుతూ, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.